# 113. అల్ ఫలఖ్ (ఉషోదయం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 5 ఆయతులు ఉన్నాయి. ప్రతి దుష్టశక్తి నుంచి అల్లాహ్ శరణు కోరడాన్ని ఇందులో ముఖ్యంగా ప్రస్తావించడం జరిగింది. మొదటి ఆయతులో వచ్చిన 'ఫలఖ్' (ఉషోదయం) అన్న ప్రస్తావననే ఈ సూరాకు పేరుగా పెట్టడం జరిగింది. దుష్ట ప్రాణుల, దుష్టపథకాల, ప్రజల ఈర్ష్యాసూయల నుంచి ఈ సూరా ద్వారానే దేవుని శరణు కోరాలని ఈ సూరా బోధించింది.

## 113. అల్ ఫలఖ్[1] సూరా

## سُوْرَةُ الْفَلَقِ

అవతరణ :మక్కా ఆయతులు :5

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1** చెప్పు : నేను ప్రాతఃకాలపు ప్రభువు శరణు కోరుతున్నాను[2] –

قُلْ اَعُوْذُ بِرَبِّ الْفَلَقِ ۙ① 

1. ఈ సూరా తరువాత సూరతున్నాస్ రాబోతోంది. ఈ రెండు సూరాల మహత్తు గురించి ఎన్నో హదీసులున్నాయి. ఉదాహరణకు : ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు : "ఈ రోజు రాత్రి నాపై కొన్ని ఆయతులు అవతరించాయి. అటువంటి ఆయతులను నేను కనీ వినీ ఎరుగను." ఇలా చెప్పిన తరువాత ఆయన ఈ రెండు సూరాలను పఠించారు. (సహీహ్ ముస్లిం – ప్రయాణీకుల నమాజు ప్రకరణం; తిర్మిజీ). అబూ హాబిస్ జుహనీ (రజి)తో ఆయన (సఅసం) ఒకసారి, "ఓ అబూ హాబిస్! శరణుకోరే వారు ఏ తావీజు ఆధారంగా శరణుకోరుతారో దాని గురించి నీకు తెలుపనా?" అన్నారు. దానికి ఆయన, 'తప్పకుండా తెలుపండి' అని అభ్యర్థించారు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) ఈ రెండు సూరాలను ప్రస్తావించి, **"ఇవి రెండూ 'ముఅవ్వజతైన్' (రక్షణ కోరబడేవి)"** అని అన్నారు. (సహీహ్ నసాయి– లిల్ అల్బానీ. నెం.5020). మానవుల, జిన్నుల దిష్టినుండి దైవప్రవక్త (స) శరణు కోరేవారు. ఈ రెండు సూరాలు అవతరించిన తరువాత ఆయన (స) వాటిని పారాయణం చేయటం ఆనవాయితీగా చేసుకుని, ఇతరత్రా వాటిని వదలివేశారు. (సహీహ్ తిర్మిజీ – లిల్ అల్బానీ:2150). మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా తెలిపారు: "ఆయన (స)కు ఎప్పుడు, ఏ బాధ కలిగినా 'ముఅవ్వజతైన్' (ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్, ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్ సూరాలు) పఠించి తన దేహంపై ఊదేవారు. చివరి రోజుల్లో ఆయన (స) బాధ మరీ పెరిగి పోయినప్పుడు నేను ఈ రెండు సూరాలను పఠించి, శుభం జరుగుతుందన్న ఆశతో ఆయన రెండు చేతులను ఆయన (స) శరీరంపై స్పర్శించేదాన్ని." (బుఖారీ – ఫజాయిలె ఖుర్ఆన్; ముస్లిం – కితాబుస్సలామ్).

దైవప్రవక్త (సఅసం)కు చేతబడి జరిగినప్పుడు దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఈ రెండు సూరాలనే తీసుకుని వచ్చి, ఒక యూదవ్యక్తి ఆయన (స)పై చేతబడి చేశాడని, ఆ చేతబడికి సంబంధించిన సామగ్రి అంతా ఫలానా బావిలో ఉందని

**2** ఆయన సృష్టించిన వాటన్నింటి కీడు నుండి,[3]

مِنْ شَرِّ مَا خَلَقَ ۙ﴿٢﴾

**3** కటిక చీకటి క్రమ్ముకున్నప్పటి రాత్రి చీకటి కీడు నుండి,[4]

وَمِنْ شَرِّ غَاسِقٍ إِذَا وَقَبَ ۙ﴿٣﴾

తెలియజేశారు. మహాప్రవక్త (సఅసం) హజ్రత్ అలీ (రజి)ని పంపి ఆ వస్తువులను తెప్పించారు. (ఆ వస్తువులలో ఒక దువ్వెన, కొన్ని వెంట్రుకలు, నరం ఉన్నాయి. ఆ నరానికి పదకొండు ముడులు వేయబడివున్నాయి. సూదులు గుచ్చబడిన ఒక మైనపు దిష్టిబొమ్మ కూడా ఉంది. జిబ్రయీల్ సూచన ప్రకారం ఆయన (సఅసం) ఈ రెండు సూరాలలోని ఒక్కొక్క ఆయత్‌ను పఠిస్తూపోతే, ఒక్కొక్క ముడి విచ్చుకోసాగింది. చివరి ఆయతు వరకూ వచ్చేసరికి ముడులన్నీ విచ్చుకున్నాయి. సూదులన్నీ ఊడి పడ్డాయి. దాంతో ఆయన (స)కు సంపూర్ణస్వస్థత చేకూరింది. అప్పటివరకూ ఇబ్బంది పడుతూ ఉన్న ఆయన (స)కు పూర్తి స్వేచ్ఛ లభించినట్టయింది. (సహీహ్ బుఖారీ – ఫత్‌హుల్ బారీతో సహా – కితాబుత్తిబ్; ముస్లిం – కితాబుస్సలామ్). సాధారణంగా మహాప్రవక్త (సఅసం) రాత్రి నిద్రించే సమయంలో ఇఖ్లాస్ సూరాను, ముఅవ్వజతైన్‌ను పఠించి తన రెండు అరచేతులపై ఊదేవారు. ఆ తరువాత అరచేతులను తన శరీరంపై తుడిచేవారు. మొదట తలను, పిదప మొహాన్ని, తర్వాత ఉదరభాగాన్ని, ఆ తర్వాత శరీరంలోని మిగతా భాగాన్ని తుడిచేవారు. ఆయన (స) మూడుసార్లు ఈ విధంగా చేసేవారు. (సహీహ్ బుఖారీ – ఖుర్ఆన్ మహిమల ప్రకరణం).

2. **'ఫలఖ్'** ( فَلَق ) అంటే అసలు ఉషోదయం లేక ప్రభాత సమయం అని అర్థం. దేవుడు ఏవిధంగా చిమ్మచీకట్లను చీల్చి పగటి వెలుగును ప్రస్ఫుటం చేస్తాడో అదే విధంగా ఆ దేవుడు భయోత్పాతాన్ని, వ్యాకులతను దూరంచేసి, తన రక్షణ కోరేవారికి శాంతి భద్రతలను చేకూరుస్తాడు. లేదా గాఢాంధకారంలో గడిపే మనిషి తెల్లవారి వెలుగుకోసం ఎలా వేచి ఉంటాడో అలాగే భీతిగొన్నవాడు దేవుని శరణు ద్వారా శుభసమయం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. (ఫత్‌హుల్ ఖదీర్).

3. సృష్టితాలు అనేపదం సర్వసామాన్యం. ఈ సృష్టితాలలో షైతాను, వాడి మానసపుత్రులు, నరకం మరియు మనిషికి హానికలిగించే సమస్తమూ వచ్చేస్తాయి.

4. రాత్రిపూట దట్టమైన చీకటిలో క్రూరమృగాలు, విష సర్పాలు స్వైరవిహారం చేస్తాయి. నేరప్రవృత్తి గలవాళ్ళు ఈ సమయంలోనే తమ పథకాలను అమలుపరుస్తారు. అందువల్ల ఈ వాక్యం ద్వారా దుష్టశక్తులన్నింటి కీడు నుంచి శరణు జొచ్చటం

| | |
|---|---|
| **4** (మంత్రించి) ముడులలో ఊదే వారి కీడు నుండి,[5] | وَمِنْ شَرِّ النَّفّٰثٰتِ فِى الْعُقَدِ ۝٤ |
| **5** అసూయాపరుడు అసూయచెందినప్పటి కీడు నుండి[6] (నేను నా ప్రభువు రక్షణ కోరుతున్నాను). | وَمِنْ شَرِّ حَاسِدٍ اِذَا حَسَدَ ۝٥ |

జరిగింది. **'ఘాసిఖున్'** ( غَاسِقٍ ) అంటే రాత్రి అని అర్థం. **'వఖబ్'** ( وَقَبَ ) అంటే వ్యాపించటం, క్రమ్ముకోవటం, ఆవరించటం, అలుముకోవటం అని భావం.

5. ముడులలో మంత్రించే వారంటే చేతబడి, క్షుద్రవిద్యకు పాల్పడే వారన్నమాట. **'నప్ఫాసాత్'** ( نَفّٰثٰت ) అనే పదం స్త్రీలింగాన్ని సూచిస్తున్నప్పటికీ క్షుద్రవిద్యకు ఒడిగట్టే స్త్రీ పురుషులందరికీ ఇది వర్తిస్తుంది. ఈ మాంత్రికులు భూత పిశాచాలను ఆశ్రయించి ఈ ముదనష్టపు పనులు చేస్తారు. సాధారణంగా వారు ఎవరిపై చేతబడి చేయదలుస్తారో వారికి చెందిన కొన్ని వస్తువులను తెలివిగా రాబడతారు. ఉదాహరణకు : వెంట్రుకలు, దువ్వెనలు, దుస్తులు.

6. అసూయాపరుడు, తాను అసూయ చెందేవారి దగ్గరున్నదంతా నాశనమైపోవాలని కోరుకుంటాడు. అందుకే అసూయాపరుని కీడు నుండి కూడా శరణుకోరటం జరిగింది. అసూయ కూడా అత్యంత దారుణమైన నైతిక రుగ్మతే. అది మనిషిలోని మంచినంతటినీ హరించివేస్తుంది.